క్లుప్తంగా

మర్యాదపూర్వకంగా..



ఎంపీ ఆదాలకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎమ్మెల్యే సంజీవయ్య

నెల్లూరురూరల్: నగరంలోని ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డిని ఆయన నివాసంలో సోమవారం పలువురు మర్యాదపూర్వకంగా కలిశారు. సూళ్లూరుపేట ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య ఎంపీని కలసి పుష్పగుచ్ఛం అందజేసి పలు అంశాలపై చర్చించారు. అలాగే డీటీసీ చందర్, పలువురు పోలీసు, వివిధ శాఖల అధికారులు, వైఎస్సార్‌సీపీ నాయకులు ఎంపీని కలిసి మాట్లాడారు. విజయ డెయిరీ చైర్మన్ రంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సామాజిక సాధికార యాత్రలో మేయర్



నెల్లూరు(బారకాసు): వైఎస్సార్ జిల్లా బద్వేల్ నియోజకవర్గంలో సోమవారం జరిగిన సామాజిక సాధికార బస్సు యాత్రలో ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి, ఎమ్మెల్యే దాసరి సుధతో కలిసి నెల్లూరు నగరపాలక సంస్థ మేయర్ పొట్లూరి స్రవంతిజయవర్ధన్ పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ



నెల్లూరు(దర్గామిట్ట): ఆంధ్రప్రదేశ్ గ్రామ వార్డు సచివాలయాల ఉద్యోగుల సంక్షేమ సంస్థ, నెల్లూరు జిల్లా కమిటీ రూపొందించిన టేబుల్ క్యాలెండర్‌ను జాయింట్ కలెక్టర్ ఆర్.కూర్మనాథ్ సోమవారం తన చాంబర్‌లో ఆవిష్కరించారు. సచివాలయాల ఉద్యోగులు సమర్థవంతంగా పనిచేసి ప్రభుత్వానికి మంచిపేరు తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి సుస్మిత, సంస్థ అధ్యక్ష, కార్యదర్శులు, నేతలు తదితరులు పాల్గొన్నారు.

డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో..



నెల్లూరు సిటీ: ఆంధ్రప్రదేశ్ హెల్త్ ఎడ్యుకేషన్ అండ్ మీడియా ఆఫీసర్స్ అసోసియేషన్ – 2024 సంవత్సరం క్యాలెండర్‌ను సోమవారం డీఎంహెచ్‌ఓ ఎం.పెంచలయ్య ఆవిష్కరించారు. నగరంలోని డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో డీఎంహెచ్‌ఓ మీడియా ఆఫీసర్స్ అసోసియేషన్ సభ్యులు, డెమో బి.శ్రీనివాసరావు, కనకరత్నం, రమేష్, ప్రమోద్, రమేష్, పెంచలరావు, కిషోర్‌కుమార్, శ్రీరామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

శివప్రియకు గోల్డ్‌మెడల్



నెల్లూరు(టౌన్): నగరంలోని కొండాయపాళెం గంగోత్రినగర్‌కు చెందిన తాళ్లేటి శివప్రియ గోల్డ్ మెడల్ సాధించింది. అనంతపురం జేఎన్టీయూలో బీటెక్ కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్‌లో అత్యధిక మార్కులు సాధించిన సందర్భంగా ఆ యూనివర్సిటీలో జరిగిన స్నాతకోత్సవంలో శివప్రియకు గోల్డ్‌మెడల్ అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా అగ్నికుల క్షత్రియ సంఘం తరఫున శివప్రియకు అభినందనలు తెలిపారు.

ఘన సన్మానం



నెల్లూరు(టౌన్): జిల్లా ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయీస్ అసోసియేషన్ సంయుక్త కార్యదర్శిగా కూల్లూరి ప్రభాకర్ ఎన్నికైన సందర్భంగా సోమవారం స్థానిక సంతపేటలోని మోడల్ హైస్కూల్‌లో ఆ పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం శ్రీనివాసులు, సహోద్యోగులు నారాయణరావు, జయప్రకాష్ బాబు, వెంకటేశ్వర్లు, పెంచలరెడ్డి, మల్లేశ్వరి, షబీనా, ప్రసాద్ పాల్గొన్నారు.

సంక్షేమ సారథి సీఎం వైఎస్ జగన్



లబ్ధిదారుకు పింఛన్ అందజేస్తున్న ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి

• ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి

నెల్లూరురూరల్: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాల సారథి అని, దేశ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ పింఛన్లు అందజేసిన ఘనత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికే దక్కుతుందని ఎంపీ, వైఎస్సార్‌సీపీ రూరల్ నియోజకవర్గ సమన్వయకర్త ఆదాల ప్రభాకర్‌రెడ్డి అన్నారు. అవ్వాతాతలకు పింఛన్ నగదు రూ.3 వేలకు పెంచిన నేపథ్యంలో నెల్లూరు రూరల్ మండలంలోని 18 పంచాయతీలకు సంబంధించి నగరంలోని రూరల్ ఎంపీడీఓ కార్యాలయంలో, రూరల్ నియోజకవర్గంలోని 26 డివిజన్‌లకు సంబంధించి కస్తూర్బా కళాక్షేత్రంలో సోమవారం ఉత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీ ఆదాల మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పింఛన్ నగదును ప్రతి ఏటా పెంచి ఇచ్చిన హామీని నిలబెట్టుకున్నారని తెలిపారు. వచ్చే ఎన్నికల్లో అన్నివర్గాల ప్రజలు వైఎస్సార్‌సీపీని ఆదరించాలని కోరారు. మరలా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సీఎం అయితే సంక్షేమ పథకాలు యథావిధిగా కొనసాగుతాయని తెలిపారు. నెల్లూరు రూరల్ నియోజకవర్గం ప్రస్తుతం ఎంతో ప్రశాంతంగా ఉందన్నారు. రూరల్ నియోజకవర్గం అభివృద్ధికి ప్రభుత్వం కోట్లాది రూపాయలు మంజూరు చేసిందని గుర్తుచేశారు. అనంతరం నూతనంగా మంజూరైన పింఛన్లను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. అలాగే డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. అంబేడ్కర్ సేవలను కొనియాడారు. 'ఆడుదాం ఆంధ్రా' క్రీడాకారులకు కిట్లు అందజేశారు. కార్యక్రమంలో నగరపాలక సంస్థ కమిషనర్ వికాస్ మర్మత్, విజయ డెయిరీ చైర్మన్ రంగారెడ్డి, రూరల్ ఎంపీపీ బూడిద విజయకుమార్, ఇన్‌చార్జి ఎంపీడీఓ శైలేంద్రకుమార్, రైల్వేబోర్డు మెంబర్ స్వర్ణా వెంకయ్య, మద్రిపాడు జెడ్పీటీసీ సభ్యుడు మల్లు సుధాకర్‌రెడ్డి, నేతలు హరిబాబుయాదవ్, కోటేశ్వరరెడ్డి, వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు గౌరీ, పలువురు కార్పొరేటర్లు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.

విద్యార్థులకు బహుమతుల ప్రదానం



అంబేడ్కర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): నగరంలోని వెంకటేశ్వరపురం మున్సిపల్ కార్పొరేషన్ ఉన్నత పాఠశాలలో సోమవారం 'జన్ భాగిదరి' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రపటానికి ఉపాధ్యాయులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం విద్యార్థులతో భారత రాజ్యాంగ పీఠికను చదివించి వ్యాసరచన, చిత్రలేఖనం, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతి ప్రదానం చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం మంజులవాణి, రాజమనోహర్, ఖాజారంతుల్లా, ధనరాజ్, రమణయ్య, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

న్యాయవాదుల విధుల బహిష్కరణ పొడిగింపు



మాట్లాడుతున్న వేనాటి చంద్రశేఖర్ రెడ్డి

నెల్లూరు(లీగల్): నూతనంగా ప్రవేశపెట్టిన ఏపీ భూ హక్కుల చట్టాన్ని రద్దు చేయాలంటూ న్యాయవాదులు కోర్టు విధులను బహిష్కరిస్తున్న నేపథ్యంలో విధుల బహిష్కరణను ఈ నెల 12వ తేదీ వరకు పొడిగిస్తున్నట్లు నెల్లూరు బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి సుందరయ్యయాదవ్ తెలిపారు. నగరంలోని జిల్లా కోర్టు ఆవరణలో ఉన్న బార్ అసోసియేషన్ కార్యాలయంలో సోమవారం సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో ఏపీ బార్ కౌన్సిల్ సభ్యుడు వేనాటి చంద్రశేఖర్ రెడ్డి పాల్గొని మాట్లాడారు. మెజార్టీ సభ్యుల అభిప్రాయం మేరకు విధుల బహిష్కరణ కార్యక్రమాన్ని పొడిగిస్తున్నట్లు తెలిపారు. ఉద్యమం ఉధృతం కోసం సీనియర్ న్యాయవాది ఎం.బ్రహ్మం కన్వీనర్‌గా స్పెషల్ కమిటీ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వివిధ మార్గాల ద్వారా ప్రజలకు ఈ చట్టం గురించి తెలియజేస్తామని పేర్కొన్నారు.

ముందస్తు సంక్రాంతి సంబరాలు



ముగ్గులు వేస్తున్న విద్యార్థులు

నెల్లూరు(టౌన్): స్థానిక బాలాజీనగర్‌లోని కిడ్జి స్కూల్‌లో సోమవారం ముందస్తు సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు సంప్రదాయ దుస్తులు ధరించి ఈ కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొన్నారు. గొబ్బెమ్మలు, గాలిపటాలు, గంగిరెద్దులు, ముగ్గుల పోటీలు తదితర కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ దినేష్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఊళ్లమ్మతల్లికి ప్రత్యేక పూజలు



ఆదాల, వేమిరెడ్డిలను గజమాలతో సత్కరిస్తున్న నాయకులు

నెల్లూరురూరల్: రూరల్ మండలంలోని కోడూరుపాడు గ్రామదేవత ఊళ్లమ్మతల్లి కుంభాభిషేకం సందర్భంగా ఆదివారం రాత్రి రాజ్యసభ సభ్యుడు, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, నెల్లూరు ఎంపీ, వైఎస్సార్‌సీపీ రూరల్ నియోజకవర్గ సమన్వయకర్త ఆదాల ప్రభాకర్‌రెడ్డి ఆ ఆలయంలో అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్థానిక నేతలు వారికి ఘన స్వాగతం పలికి గజమాలతో సత్కరించారు. కార్యక్రమంలో నాయకులు కోడూరు కమలాకర్‌రెడ్డి, లేబూరు పరమేశ్వరరెడ్డి, పలువురు కార్పొరేటర్లు, నాయకులు పాల్గొన్నారు.

అరుదైన శస్త్రచికిత్స

నెల్లూరు సిటీ: ఊపిరితిత్తుల వ్యాధితో బాధపడుతున్న మహిళకు సోమవారం మెడికవర్ హాస్పిటల్ వైద్యులు అరుదైన శస్త్రచికిత్స చేశారు. నగరంలోని మెడికవర్ హాస్పిటల్‌లో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో డాక్టర్ కాటంరెడ్డి కౌశిక్ రెడ్డి మాట్లాడుతూ తిరుపతికి చెందిన 34 ఏళ్ల వయస్సు కలిగిన రమాదేవి గత కొంతకాలంగా ఊపిరితిత్తుల వ్యాధితో బాధపడుతుండడంతో ఆమెకు శస్త్రచికిత్స చేసినట్లు తెలిపారు. ఈ చికిత్సను హైదరాబాద్, బెంగళూరు, చెన్నై నగరాల్లో మాత్రమే చేస్తారన్నారు. తాము నెల్లూరులో ఈ చికిత్స చేసినట్లు తెలిపారు.

బాల్య వివాహం నేరం

నెల్లూరు(పొగతోట): బాల్య వివాహాలు నేరమని, వాటిని ప్రోత్సహించే వారికి రెండు సంవత్సరాల జైలు శిక్ష, రూ.లక్ష వరకు జరిమానా విధించడం జరుగుతుందని జిల్లా బాలల సంరక్షణ అధికారి బి.సురేష్ తెలిపారు. సోమవారం నగరంలోని డీఆర్‌డీఏ సమావేశ మందిరంలో స్వయం సహాయక గ్రూపు మహిళల మండల అధ్యక్ష, కార్యదర్శులకు బాల్య వివాహాల నిషేధ చట్టంపై నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో డీపీఎం కామాక్షి, బాలల సంరక్షణ ఆఫీసర్స్ సుమలత, సమత, మండల అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు.

ఘనంగా ఆరాధన ఉత్సవం



నెల్లూరు(బృందావనం): నగరంలోని పొగతోటలో ఉన్న ఆదిశంకర ధ్యానమందిరంలో చక్రాల వారి ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ చక్రాల ఆనందకుమార్ ఆధ్వర్యంలో పరమాచార్య కంచి కామకోటి పీఠాధిపతులు చంద్రశేఖరేంద్ర సరస్వతి స్వామి ఆరాధన మహోత్సవం సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ ఉత్సవాలను జంగా శివకుమార్ ప్రారంభించారు. కార్యక్రమంలో వేలమూరు సోమశేఖర శర్మ ఉపన్యసించారు. ఈ సందర్భంగా స్వయంపాకుల శ్రీరామచంద్రమూర్తి, కల్పవల్లి ఎడ్యుకేషనల్ ట్రస్ట్ తరఫున నలుగురు విద్యార్థులకు రూ.50 వేలు విద్యాప్రోత్సాహకం అందజేశారు.

సినిమా అసోసియేషన్ ప్రమాణ స్వీకారం



నెల్లూరు(బృందావనం): స్థానిక పురమందిరం ప్రాంగణంలోని ఏసీ హాల్‌లో ఆదివారం రాత్రి 'నెల్లూరు సినిమా అసోసియేషన్' నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారోత్సవం ఘనంగా నిర్వహించారు. ఆ అసోసియేషన్ కమిటీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా శివలంకి జనార్దన్, గోనుగుంట రవికుమార్, కోశాధికారిగా కొండూరు రాంప్రసాద్, మరో 12 మంది సభ్యులుగా ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా 25 కళాసంఘాల అధ్యక్షుడు అమరావతి కృష్ణారెడ్డి హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో నిర్మాత, సినిమా డిస్ట్రిబ్యూటర్ నజీర్‌బాషా, 25 కళాసంఘాల కన్వీనర్లు దొర్నాల హరిబాబు, షేక్ అమీర్‌జాన్, నేదురుమల్లి హరనాథ్‌రెడ్డి పాల్గొన్నారు.

11న జిల్లాస్థాయి వ్యాసరచన పోటీలు

నెల్లూరు (టౌన్): రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేడ్కర్ 125 అడుగుల విగ్రహావిష్కరణ సందర్భంగా ఈ నెల 11న నెల్లూరులోని డీకే డబ్ల్యూ కళాశాలలో 'అంబేడ్కర్–సామాజిక న్యాయం' అనే అంశంపై జిల్లా స్థాయి వ్యాసరచన పోటీలు నిర్వహిస్తున్నట్లు డీఈఓ గంగాభవాని సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. విజేతలకు ప్రథమ బహుమతి రూ.లక్ష, ద్వితీయ బహుమతి రూ.75 వేలు, తృతీయ బహుమతి రూ.50 వేలు అందజేయనున్నట్లు వెల్లడించారు. ఉదయం 10 గంటలకు 12 నుంచి 15 ఏళ్లలోపు , మధ్యాహ్నం 2గంటలకు 15 నుంచి 18 ఏళ్లలోపు విద్యార్థులకు పోటీలు ఉంటాయని చెప్పారు. ఆసక్తి కలిగిన విద్యార్థులు ముందుగా రిజిస్ట్రేషన్ చేసుకుని ఆధార్ కార్డుతో హాజరుకావాలని సూచించారు. మరిన్ని వివరాలకు 93811 12743, 94947 54535 నంబర్లను సంప్రదించాలని కోరారు.

నేడు జిల్లాస్థాయి సభ

• కలెక్టర్ హరినారాయణన్

నెల్లూరు(దర్గామిట్ట): 'జన్ భాగీదరి' కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో ఈ నెల 19న విజయవాడలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సామాజిక న్యాయ మహాశిల్పం ఆవిష్కరణ సందర్భంగా మంగళవారం ఉదయం 10 గంటలకు నగరంలోని కస్తూర్బా కళాక్షేత్రంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ – సామాజిక న్యాయం అనే అంశంపై జిల్లాస్థాయి సభ జరుగుతుందని కలెక్టర్ ఎం.హరినారాయణన్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సభలో పలువురు వక్తలు పాల్గొని సందేశం ఇస్తారని, ప్రతి ఒక్కరూ హాజరై జయప్రదం చేయాలని కోరారు.

నేత్రదానం



జానా వెంకయ్య

నెల్లూరు సిటీ: రూరల్‌లోని సౌత్‌మోపూరుకు చెందిన జానా వెంకయ్య (80) అనారోగ్యంతో ఆదివారం మృతిచెందారు. ఈ క్రమంలో కుటుంబ సభ్యుల అంగీకారంతో జానా వెంకయ్య నేత్రాలను ఎల్‌వీ ప్రసాద్ ఐ హాస్పిటల్ కార్నియా రికవరీ స్పెషలిస్ట్ బి.లాలేష్, ఐ డొనేషన్ కౌన్సిలర్ బాలాజీసింగ్ సేకరించారు. అనంతరం కుటుంబ సభ్యులకు సర్టిఫికెట్ అందచేశారు. నేత్రదానం చేయదలచినవారు 9948164781, 9347111033 ఫోన్‌నంబర్లలో సంప్రదించాలని వారు తెలిపారు.

దుప్పట్ల పంపిణీ

నెల్లూరు(వీఆర్సీసెంటర్): వైఎస్సార్‌సీపీ నాయకుడు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి జన్మదినం సందర్భంగా సోమవారం తలారి బాలసుధాకర్ ఆధ్వర్యంలో నగరంలోని సాల్వేషన్ ఆర్మీ చర్చిలో కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా తలారి బాలసుధాకర్ మాట్లాడుతూ రామ్‌కుమార్‌రెడ్డి నిర్వహిస్తున్న ఫౌండేషన్ ద్వారా పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. అనంతరం దివ్యాంగులు, వృద్ధులకు అల్పాహారం అందజేసి దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సాల్వేషన్ ఆర్మీ చర్చి సేవకులు ప్రసాద్, మేరీగ్రేస్, రూబెన్, పాస్టర్లు తదితరులు పాల్గొన్నారు.

వాకర్స్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం



నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): జిల్లా వాకర్స్ ఇంటర్నేషనల్ నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకార కార్యక్రమం నగరంలోని సీపీఆర్ కల్యాణ మండపంలో సోమవారం నిర్వహించారు. గవర్నర్‌గా పలగాటి శ్రీనివాసులు రెడ్డి, డిప్యూటీ గవర్నర్‌గా కనకట్ల రఘురాం ముదిరాజ్, నలుబోలు బలరామయ్య నాయుడు, ఎంవీ రెడ్డి, వేలూరు రంగారావు, ఏకొల్లు రాఘవరెడ్డి, వినుకొండ వెంకటేశ్వర్లు, రామ్మోహన్‌రెడ్డి ప్రమాణ స్వీకారం చేశారు. కార్యక్రమంలో వాకర్స్ ఇంటర్నేషనల్ ప్రెసిడెంట్ మురళీమోహన్‌రావు, మాజీ ప్రెసిడెంట్ నేతాజీ సుబ్బారెడ్డి, ట్రెజరర్ ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.

బాధితులకు న్యాయం జరిగేలా చూడాలి



వృద్ధురాలి సమస్యను తెలుసుకుంటున్న ఎస్పీ తిరుమలేశ్వరరెడ్డి

• ఎస్పీ తిరుమలేశ్వరరెడ్డి

నెల్లూరు(క్రైమ్): బాధితులకు న్యాయం జరిగేలా చూడాలని ఎస్పీ కె.తిరుమలేశ్వరరెడ్డి పోలీసు అధికారులను ఆదేశించారు. నగరంలోని ఉమేష్‌చంద్ర మెమోరియల్ కాన్ఫరెన్స్ హాలులో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక స్పందన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా నలుమూలల నుంచి వచ్చిన 130 మంది తమ సమస్యలపై ఎస్పీకి ఫిర్యాదు చేశారు. ప్రధానంగా ప్రభుత్వ, ప్రైవేట్ రంగ సంస్థల్లో ఉద్యోగాలు ఇప్పిస్తామని పలువురు రూ.లక్షలు తీసుకుని మోసగించారని, ప్రేమపేరిట వంచన, అదనపుకట్నం కోసం వేధింపులు, బ్యాంక్‌లో లోన్లు, ఆస్తి వివాదాలు, ఆస్తి కోసం తల్లిదండ్రులపై వేధింపులు, దంపతుల మధ్య విభేదాలు తదితరాలపై ఫిర్యాదులు అందాయి. ఉద్యోగాల పేరిట మోసగించిన నిందితులపై చర్యలు తీసుకోవాలని పలువురు బాధితులు ఎస్పీని కోరారు. అర్జీలను పరిశీలించిన అనంతరం ఎస్పీ మాట్లాడుతూ నిర్ణీత గడువు లోపు చట్టపరిధిలో సమస్యను పరిష్కరించాలని పోలీసు అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ, ప్రైవేట్ రంగాల్లో ఉద్యోగాలు ఇప్పిస్తామని రూ.లక్షలు తీసుకునే వ్యక్తుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. అలాంటి వారిని నమ్మి మోసపోవద్దని సూచించారు. స్పందన ఫిర్యాదుల పరిష్కారంలో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని పోలీసు అధికారులను హెచ్చరించారు. కార్యక్రమంలో ఏఎస్పీలు సీహెచ్ సౌజన్య, ప్రసాద్, ఎస్సీ ఎస్టీ సెల్ డీఎస్పీ శ్రీనివాసరావు, ట్రెయినీ డీఎస్పీ హేమలత తదితరులు పాల్గొన్నారు.

జేఏఓ ఉద్యోగం పేరిట మోసం

నేను ఓ సబ్‌స్టేషన్‌లో షిఫ్ట్ ఆపరేటర్‌గా పనిచేస్తున్నాను. ఏపీఎస్పీడీసీఎల్ ఉద్యోగి మాధవరెడ్డితో నాకు పరిచయం ఏర్పడింది. రూ.10 లక్షలు పెట్టుకుంటే నా భార్యకు ఏపీఎస్పీడీసీఎల్‌లో జూనియర్ అకౌంట్ ఆఫీసర్ ఉద్యోగం ఇప్పిస్తానని ఆయన నమ్మబలికాడు. మాధవరెడ్డి మాటలు నమ్మి నగదు ఇచ్చాను. నెలలు గడుస్తున్నా ఉద్యోగం ఇప్పించకపోవడంతో గట్టిగా నిలదీయగా రేపు, మాపు అంటూ కాలయాపన చేస్తున్నాడు. విచారించి తగిన చర్యలు తీసుకోవాలి. – **రవిబాబు, ఊటుకూరు**

పాస్‌పుస్తకం ఇప్పిస్తానని మోసగించారు

నా పొలానికి పట్టాదారు పాస్‌పుస్తకం ఇప్పిస్తానని నాగరాజు అనే వ్యక్తి రూ.లక్ష నగదు తీసుకున్నాడు. పాస్ బుక్ ఇప్పించకపోవడంతో అతనిని నిలదీయగా దౌర్జన్యం చేస్తున్నాడు. విచారించి చర్యలు తీసుకోండి.

– **ఫక్రుద్దీన్, కోవూరు**

చెత్త సేకరణలో ఇబ్బందులు లేకుండా చూడండి

• కమిషనర్ వికాస్‌మర్మత్



నగరవాసుల సమస్యలు తెలుసుకుంటున్న కమిషనర్ వికాస్‌మర్మత్

నెల్లూరు(బారకాసు): మున్సిపల్ కార్మికుల సమ్మె నేపథ్యంలో ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా తగు చర్యలు తీసుకోవాలని కమిషనర్ వికాస్‌మర్మత్ అధికారులను ఆదేశించారు. నెల్లూరు నగరపాలక సంస్థ కార్యాలయంలోని డాక్టర్ ఏపీజే అబ్దుల్‌కలాం సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో కమిషనర్ పాల్గొని నగర ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఔట్‌సోర్సింగ్ పారిశుద్ధ్య కార్మికులు కూడా ప్రభుత్వానికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు. డోర్ టు డోర్ కలెక్షన్‌ను ఆటోల ద్వారా చేయాలని, అందుకు అవసరమైన రోజు వారీ కూలీలను నియమించుకోవాలన్నారు. ప్రజల నుంచి స్వీకరించిన అర్జీలను పరిశీలించి సంబంధిత అధికారులు నిర్ణీత గడువులోపు నాణ్యమైన పరిష్కారం అందించాలని ఆదేశించారు. 'జన్ భాగీదారి' కార్యక్రమంలో భాగంగా నిర్వహిస్తున్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ప్రత్యేక కార్యక్రమాల్లో ప్రజలంతా భాగస్వాములు కావాలని తెలిపారు.

అంబేడ్కర్ ఆశయ సాధనకు కృషి



నెల్లూరు(దర్గామిట్ట): రాజ్యాంగ ప్రతిజ్ఞ చేస్తున్న జేసీ, డీఆర్‌ఓ తదితరులు



నెల్లూరు(టౌన్): సమగ్రశిక్ష కార్యాలయంలో..



నెల్లూరు(పొగతోట): ప్రతిజ్ఞ చేయిస్తున్న జెడ్పీ సీఈఓ చిరంజీవి

• జాయింట్ కలెక్టర్ కూర్మనాథ్

నెల్లూరు(దర్గామిట్ట): భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జాయింట్ కలెక్టర్ ఆర్.కూర్మనాథ్ సూచించారు. జన్ భాగీదారి కార్యక్రమంలో భాగంగా సోమవారం కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సామాజిక న్యాయ శిల్పం పేరిట ఏర్పాటు చేసిన సంతకాల సేకరణ కార్యక్రమంలో జేసీ సంతకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జన్ భాగీదారి కార్యక్రమంలో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా అంబేడ్కర్ విగ్రహాలను శుభ్రం చేయడంతోపాటు ఆయన సేవలను ప్రజలకు వివరిస్తున్నట్లు తెలిపారు. అనంతరం ఆయన అధికారులు, సిబ్బందితో రాజ్యాంగ ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో డీఆర్‌ఓ లవన్న, జెడ్పీ సీఈఓ భూపతి చిరంజీవి, డీపీఓ సుస్మితారెడ్డి, సర్వే ల్యాండ్ రికార్డ్స్ ఏడీ హనుమాన్ ప్రసాద్, కలెక్టరేట్ పరిపాలనాధికారి షేక్ షఫీమాలిక్ తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్‌కు నివాళి

నెల్లూరు(టౌన్): విజయవాడ స్వరాజ్ మైదానంలో 125 అడుగుల బీఆర్ అంబేడ్కర్ విగ్రహావిష్కరణను పురస్కరించుకుని సోమవారం స్థానిక సమగ్రశిక్ష కార్యాలయంలో బీఆర్ అంబేడ్కర్ చిత్రపటానికి ఏపీసీ ఉషారాణి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంబేడ్కర్ స్ఫూర్తి భావితరాలకు తెలిసేలా అన్ని పాఠశాలల్లో అంబేడ్కర్ జీవిత చరిత్రపై విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ, క్విజ్ పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

జెడ్పీ కార్యాలయంలో..

నెల్లూరు(పొగతోట): జన్ భాగీదారి కార్యక్రమంలో భాగంగా సోమవారం జెడ్పీ కార్యాలయంలో జెడ్పీ సీఈఓ చిరంజీవి ఆధ్వర్యంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం జెడ్పీ కార్యాలయ సిబ్బందితో జెడ్పీ సీఈఓ రాజ్యాంగ ప్రవేశిక ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో జెడ్పీ పరిపాలన అధికారులు పాల్గొన్నారు.

ఘనంగా పాఠశాలల్లో సంక్రాంతి వేడుకలు



కొండాయపాళెం ప్రాథమిక పాఠశాలలో సంబరాలు

నెల్లూరు(టౌన్) సంక్రాంతి పండగను పురస్కరించుకుని నగరంలోని పలు పాఠశాలల్లో ముందస్తుగా సంబరాలు నిర్వహించారు. స్థానిక వైఎస్సార్ నగర్‌లోని వండ్లూరు ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులు ముగ్గులు, భోగి మంటలు వేసి సంబరాలు చేసుకున్నారు. అనంతరం విద్యార్థులకు అరిసెలు పంపిణీ చేశారు. బాలభవన్ డైరెక్టర్ సుభద్రాదేవి, హెడ్‌మాస్టర్ లక్ష్మయ్య, ఉపాధ్యాయులు శిరీష, రియాజ్ పాల్గొన్నారు. అలాగే స్థానిక కొండాయపాళెం ఎస్సీకాలనీలోని మున్సిపల్ ప్రాథమిక పాఠశాలలో ముందస్తు సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థుల తల్లులకు రంగవల్లుల పోటీలు నిర్వహించారు. విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించారు. కార్యక్రమంలో డివిజన్ ఇన్‌చార్జి తాళ్లూరి సురేష్‌బాబు, పద్మాయాదవ్, రమాదేవి, రాజా, గోపాల్‌రెడ్డి, రసూల్, నాగేశ్వరరరెడ్డి, వాసంతిరెడ్డి, సువార్త, డానియల్, ఉపాధ్యాయులు హరీష్, రాశి పాల్గొన్నారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి



నెల్లూరురూరల్: రూరల్ మండలంలోని కోడూరుపాడు కల్తీకాలనీ సమీపంలో సోమవారం గుర్తుతెలియని వాహనం ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందాడు. మృతుడు అస్సాం వాసి(38)గా అతడి వద్ద ఉన్న ఆధార్ కార్డు ఆధారంతో నిర్ధారించారు. స్థానికులు తొలుత 108కు సమాచారం అందించగా వారు వైద్యపరీక్షలు చేసి అప్పటికే మృతిచెందినట్లు నిర్ధారించారు. రూరల్ ఎస్సై స్వప్న అక్కడికి చేరుకుని పరిశీలించారు. మృతదేహాన్ని నెల్లూరు జీజీహెచ్‌కు తరలించారు. రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.